క్లుప్తంగా

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంటలో గ్రామ సచివాలయ పరిధిలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి సోమవారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

నేడు ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. సోమవారం సాయంత్రం ఏకకాలంలో నందీశ్వరునికి, శివునికి ప్రత్యేక అభిషేక పూజలు జరుగుతాయని చెప్పారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు ఇఫ్తార్ విందు

నగరి : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా సోమవారం సాయంత్రం 5 గంటలకు నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు రంజాన్ పండుగను పురస్కరించుకుని ఇఫ్తార్ విందు ఇవ్వనున్నారు. నియోజకవర్గంలోని ముస్లింలు, మహిళలు తన ఆహ్వానాన్ని స్వీకరించి విందులో పాల్గొనాలని కోరారు.

మంత్రి రోజాతో చిత్తూరు జేసీ భేటీ



మంత్రి రోజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

నగరి : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజాను చిత్తూరు నూతన జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం నగరికి విచ్చేసిన ఆయన మంత్రిని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలు మరింత చేరువయ్యేలా చూడాలని జేసీ శ్రీనివాసులను కోరారు.

ఆలయానికి వస్తు సామగ్రి వితరణ



ఆరేటమ్మ ఆలయ చైర్మన్ మనోహర్‌రెడ్డికి వస్తువులను అందజేస్తున్న దాతలు

పుత్తూరు రూరల్: గ్రామ దేవత ఆరేటమ్మకు తిరుపతికి చెందిన కేబీ రామగోపాల్, గాయత్రి దంపతులు వెండి విభూది పట్టీ, కోరలు, ఎలక్ట్రానిక్ డ్రమ్స్‌ను వితరణగా ఇచ్చారు. తల్లిదండ్రులు భక్తవత్సలంశెట్టి, కాంతమ్మ జ్ఞాపకార్థం ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డికి వస్తువులను అందించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీవారికి గొడుగుల వితరణ



గొడుగులను వితరణగా అందిస్తున్న దాతలు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయానికి తిరుపతికి చెందిన నాగరాజశర్మ, వసుంధరదేవి దంపతులు రూ.25 వేలు విలువ చేసే రెండు గొడుగులను ఆదివారం వితరణగా అందించారు. ఆలయ మేనేజర్ వెంకటేష్‌రెడ్డి దాతలకు ఆలయ విశేషాన్ని వివరించి స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలను అందించారు.

గోవిందస్వామి సేవలు మరువలేనివి



గోవిందస్వామి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: పుత్తూరు మండల పరిషత్ చైర్మన్‌గా ఏ.గోవిందస్వామి అందించిన సేవలు మరువలేమని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. పుత్తూరు మాజీ ఎంపీపీ గోవిందస్వామి మృతి విషయం తెలిసి ఆయన ఆదివారం వేపగుంట గ్రామానికి విచ్చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోవిందస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, సర్పంచ్ గిరిజాప్రసాద్, నాయకులు లక్ష్మణమూర్తి, జయకుమార్, రాజయ్య, నరసింహులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

వేసవికాలం వచ్చిందంటే అగ్నిప్రమాదాలు మామూలేగా అన్న మాటకు చమరగీతం పాడే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తోంది. బహుళ అంతస్తుల భవనాలు, స్కూళ్లు, కళాశాలలు, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. ఈ తరహా భవన సముదాయాల్లో ఉండే వారికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా శిబిరాలు నిర్వహిస్తున్నారు.

- పుత్తూరులో ఆరేళ్లలో అగ్ని ప్రమాదాలు 260
- ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 3
- వేసవిలో జాగ్రత్తలు పాటించాలంటున్న అగ్నిమాపకశశాఖ అధికారులు
- ఏటా వారోత్సవాల సందర్భంగా మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన





పుత్తూరు అగ్నిమాపక కేంద్రం

పుత్తూరు రూరల్: వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలి ? ప్రమాదవశాత్తు మంటలు చెలరేగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఫైర్ స్టేషన్ పరిధిలోని భవనాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు సక్రమంగా ఉన్నాయా ? లేదా ? అనే అంశంపై ఆడిటింగ్ చేయడంతో పాటు ఆయా యాజమాన్యాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. పుత్తూరు అగ్నిమాపక కేంద్రం పరిధిలో పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం, పిచ్చాటూరు, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలు ఉన్నాయి. గడచిన ఆరేళ్లలో పుత్తూరు ఫైర్ స్టేషన్ పరిధిలో 260 అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోగా ముగ్గురు మృత్యువాత పడ్డారు. రూ.3 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరగ్గా, మరో రూ.3 కోట్ల మేర ఆస్తిని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. ప్రమాదాల నుంచి 14 మంది ప్రాణాలను అగ్నిమాపక సిబ్బంది రక్షించగలిగారు.

అవగాహన కోసమే వారోత్సవాలు

1944 ఏప్రిల్ 14న ముంబైలోని విక్టోరియా పోర్టులో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగింది. మృతుల సంస్మరణార్థం ఏటా ఏప్రిల్ 14 నుంచి 7 రోజుల పాటు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోంది. ఈ వారోత్సవాల్లో అగ్ని ప్రమాదాలు, జాగ్రత్తలపై ప్రజలకు అధికారులు మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పిస్తారు.

పంట ప్రమాదాలపై దృష్టి సారించాలి

వేసవిలో చెరుకు తోటల దగ్ధం వార్తలను వింటూనే ఉంటాం. ఈ ప్రమాదాలు పంట పొలాలపై వెళ్లే విద్యుత్ తీగల కారణంగా జరిగినట్లు రైతులు చెబుతుంటారు. ఒకసారి చెరుకు తోటకు అగ్గి రాసుకుంటే, దాన్ని అదుపు చేయడం కష్టతరం. క్షణాల్లో పంట మొత్తం కాలి బూడిద అవుతుంది. చెరుకు మర్దాం పంట కోసం రైతులే పంటలకు నిప్పు పెడుతుంటారు. ఆ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పక్కతోటలకు మంటలు వ్యాపించి ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటిపై అగ్నిమాపక సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పుత్తూరు అగ్నిమాపక పరిధిలో ప్రమాద వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	ఆస్తి నష్టం	కాపాడినది	ప్రాణనష్టం	కాపాడినది
2017-18	53	62,00,523	45,58,600	0	0
2018-19	48	59,06,000	50,00,000	0	0
2019-20	33	45,65,333	35,05,000	0	0
2020-21	43	55,96,000	36,78,500	0	7
2021-22	25	27,35,000	45,70,000	2	2
2022-23	58	63,92,000	1,28,58,000	1	5
మొత్తం	260	3,13,94,856	3,41,70,100	3	14

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో మెలగాలి. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా భవన సముదాయాల వద్ద మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నాం. చిన్నపాటి అలసత్వంతోనే ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లుతుంది. స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలు మేము చెప్పిన సూచనలు పాటించడం ద్వారా విలువైన ఆస్తులు, ప్రాణాలను కాపాడుకోవచ్చు. చిన్నపిల్లలకు అందుబాటులో ఉండేలా అగ్గిపెట్టెలు, టపాకాయలు ఉంచరాదు.

– నేతాజీ, పుత్తూరు ఫైర్ ఆఫీసర్



మాక్‌డ్రిల్ ద్వారా అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఆకాశ కన్నియమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం కోన చెరువు సమీపంలో వెలసిన ఆకాశ కన్నియమ్మకు ఆదివారం వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగింది. అమ్మవారిని తమిళనాడు రాష్ట్రం అమ్మవారికుప్పం గ్రామస్తులు అమ్మవారి పూజకు కావలసిన సామగ్రిలతో పంబ వాయిద్యాలతో ఊరేగింపు వచ్చారు. అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యిలతో వివిధ అభిషేకం చేశారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక దీపారధనలు ఇచ్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారిని దర్శించడానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

మాక్‌డ్రిల్



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

నగరి : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు ఫైర్ అధికారి మస్తాన్ అవగాహన కల్పించారు. ఆదివారం నగరి పట్టణం, నగరి పేట ప్రాంతాల్లో పర్యటించిన ఆయన అగ్నిప్రమాదాల నివారణ, మంటలు ఎక్కువగా వ్యాపించినపుడు, వాటిని ఎలా ఆర్పాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి మంత్రి రోజమ్మ దీవెనలు



డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుటుంబ సభ్యులతో మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు రూరల్: డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి మనవడు నామకరణోత్సవంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ, ప్రసాద్ దంపతుల కుమారుడు నెహన్ కార్తికేయన్‌ను మంత్రి రోజా అక్షితలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి మంత్రి రోజాను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

పుత్తూరు రూరల్: మతోన్మాద పాలన సాగిస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రతి ఒక్కరూ కలసి రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. ఆదివారం ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదను అదాని, అంబానీలకు దోచి పెడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రతి ఒక్కరూ కలిసి ఉద్యమించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం సీబీఐ, ఈడీ, గవర్నర్ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ దేశంలో అరాచకం సృష్టిస్తోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచిన కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయాయని చెప్పారు. ఫలితంగా సామాన్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బీజేపీ ప్రభుత్వ అరాచకాలపై ఈనెల 30 వరకు జరిగే ప్రచార భేరి కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మురళి, నగరి నియోజకవర్గ కార్యదర్శి వెంకటేష్, నాయకులు విజయ్, పురుషోత్తం, సుబ్రమణ్యంపిళ్లై శివ, సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్, నాయకులు సెల్వరాజ్, గోపి, కృష్ణారెడ్డి, దినేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి మురళి

వేడుకగా శ్రీవారి కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి వారి కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్య పూజలు నిర్వహించారు. అనంతరం మూలవర్లను పాలు, పెరుగు, తేనె, నారికేళి, సుగంధభరిత ద్రవ్యాలతో అభిషేకించారు. పట్టు పీతాంబర వస్త్రాభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కర్పూర హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం12 గంటలకు ఆలయ గర్భగుడి నుంచి శ్రీదేవి, భూదేవి శ్రీలక్ష్మీనారాయణస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కల్యాణమండపానికి మేళతాళాలతో వేంచేపు చేశారు. ఉభయదారులు తిరుపతికి చెందిన నాగరాజశర్మ, వసుంధరదేవి దంపతులను కంకణధారులను చేశారు. శ్రీవారికి ఎదురుగా శ్రీదేవి, భూదేవి విగ్రహాలను ఉంచి ప్రత్యేకంగా అలంకరించారు.

ఆలయ అర్చకుల బృందం బంతిచెండులను విసురుకున్నారు. అనంతరం నాట్యం చేసుకుంటూ రుత్వికులు శ్రీదేవి, భూదేవి విగ్రహాలను శ్రీవారి చెంతకు తీసుకొచ్చి ఆశీనులను చేశారు. ఉత్సవమూర్తుల ఎదుట హోమం నిర్వహించి శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛరణ చేశారు. శ్రీదేవి, భూదేవి మెడలో బ్యాండు వాయిద్యాల నడుమ మాంగళ్యధారణ చేశారు. భక్తులు స్వామివారికి కానుకలు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ మేనేజర్ వెంకటేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఆదరించండి

కార్వేటినగరం: జగనన్న పాలన చూసి పారిపోయిన ప్రతిపక్షం మాయమాటలు నమ్మవద్దని, నవరత్నాలతో సుపరిపాలన అందిస్తున్న జగనన్నను ఆదరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. ఆదివారం మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని పెద్ద దళితవాడ, చిన్న దళితవాడ, వడ్డెర ఇండ్లు గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన దెబ్బకు పారిపోయిన ప్రతిపక్షాలు ఎన్నికలు దగ్గర పడే సరికి ప్రజలను మోసం చేసేందుకు పగటి వేషగాళ్లుగా ఓటర్ల ముందుకు వస్తున్నారని, వారి మాయమాటలో పడి సంక్షేమ పాలనను దూరం చేసుకోవద్దని సూచించారు. జగనన్న 30 ఏళ్ల పాటు సీఎంగా కొనసాగితే పేదల తలరాతలు మారిపోతాయని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల, మైనారిటీలకు అండగా ఉంటున్న మన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, నాయకులు దొరబాబు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు కలసి గతంలో టీడీపీ పాలనలో లోపాలను ఎత్తి చూపుతూ, జగనన్న చేపడుతున్న సంక్షేమాలను వివరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను వారి అనుమతితో ఇంటికి అతికించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలకేంద్రంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, సర్పంచ్ అయ్యప్ప, వీఆర్ కుప్పంలో ఆదివారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ లిల్లీ, కుట్టి, ఆముదాల్లో ఎంపీటీసీ లిఖిత, సర్పంచ్ అనురేఖ సచివాలయ కన్వీనర్, గృహ సారథులు కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కుటుంబ సభ్యుల అనుమతితో ఇంటి గోడపై స్టిక్కర్ అతికించారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను లబ్ధిదారులను అడిగి సమాధానాలు రాబట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రజలకు గుర్తు చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్, గోపాల్, ఆనందన్, ప్రకాష్, త్యాగరాజు, రవిరెడ్డి, షణ్ముగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్వేటినగరం: ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు



వీఆర్ కుప్పంలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అతికిస్తున్న నాయకులు



ఆముదాలలో ఇంటి తలుపునకు స్టిక్కర్ అతికిస్తున్న నాయకులు

దళితులు ఐకమత్యంతో ఉండాలి



వడమాలపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత నాయకులు

వడమాలపేట: దళితులు ఐకమత్యంగా ఉంటూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలని సమతా సైనిక్‌దళ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ షాన్ రెంజర్ల రాజేష్ కోరారు. ఆదివారం వడమాలపేటలో బహుజన సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భారతదేశంలో కులంలోని హెచ్చుతగ్గులను, అంటరానితనం కోసం అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించారని, విద్యావంతులను చట్టసభలకు పంపించాలని కోరారు. వడమాలపేట మండలంలో కొంతమంది దళిత నాయకులు దళితులను దోచుకుంటూ అంబేడ్కర్ ఆశయాలను అవమానిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బహుజన సేవాసంఘం అధ్యక్షుడు దిలీప్, ప్రధాన కార్యదర్శి మునెయ్య, తిరుపతి బార్ కౌన్సిల్ సభ్యుడు జ్యోతిమూర్తి, తిరుపతి అంబేడ్కర్ భవన్ చైర్మన్ పరమశివం, వీకేసీ పార్టీ కార్యదర్శి మురుగేశన్, సంఘం సభ్యులు ఉదయ్, సాయి, ముద్దుకృష్ణ, మునస్వామి, యుగంధర్ పాల్గొన్నారు.

తపోవనం ఆశ్రమానికి వితరణ

చిత్తూరు రూరల్: చిత్తూరులోని తపోవనం ఆశ్రమానికి 1990–91 పూర్వ విద్యార్థులు ఆదివారం జూషర్, టవర్ ఫ్యాన్స్ అందజేశారు. అలాగే దుస్తులు పంచారు. అనంతరం వారి మధ్య కేక్ కట్ చేశారు. పూర్వ విద్యార్థులంతా అక్కడ కాసేపు సరదాగా గడిపారు.

బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

నగరి : ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలను అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య అన్నారు. ఆదివారం 'మోడీని గద్దె దించుదాం–భారతదేశాన్ని కాపాడుకుందాం' అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బస్టాండు ప్రాంగణంలో ఆయన ఆవిష్కరించి పార్టీ కార్యకర్తలకు అందజేశారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ, అమిత్ షా నాయకత్వంలోని బీజేపీ పార్టీ భారతదేశంలో ఉన్న దళిత, మైనారిటీ వర్గాలపై దాడులు చేస్తూ నిరంకుశ పరిపాలన కొనసాగిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా మైనారిటీలపై దాడులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే, వారిపైన కేసులు పెడుతూ దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆంధ్ర రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మొండి వైఖరి చూపుతూ, రాష్ట్ర ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు అందించకపోవడం, విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేలన్, బాషా, పేరుమాల్, రూప్‌కుమార్, మురళి శేఖర్, పెరుమాల్, జగదీష్, తంగరాజు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కళలే సమాజ వికాసానికి కరదీపికలు

- ఘనంగా రంగస్థల దినోత్సవం
- కళాకారులకు విశిష్ట సేవా పురస్కారాలతో సత్కారం

తిరుపతి కల్చరల్: కందుకూరి వీరేశలింగం జయంతి, తెలుగు నాటక -రంగస్థలి దినోత్సవాన్ని సుబ్బరాజు నాట్య కళా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్వీ నాట్య కళాపరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజ వికాసానికి కళలు కరదీపికలని, అలాంటి కళారంగంలో రాణిస్తూ కళామతల్లికి సేవలు అందిస్తున్న కళాకారులు అభినందనీయులని కొనియాడారు. అనంతరం నాటక రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న కళాకారులు కె.రాధాకృష్ణ, మల్లిఖార్జునయ్య, కన్నెప్పగారి కేశవులురెడ్డి, నారాయణస్వామి, సుంకర సుబ్బారెడ్డి, జి.సుజన ఉత్తమ విశిష్ట సేవా పురస్కారాలు అందుకున్నారు. అలాగే రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో తెలుగు నాటక, రంగస్థలి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళా రంగంలో రాణిస్తున్న కళాకారులు కస్పా పద్మనాభన్, జీఎస్ కోటేశ్వరరావు, మేకల గంగయ్య, భాస్కర్‌ను వీరేశలింగం సేవా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుబ్బరాజు నాట్య కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు, ఆమూరి సుబ్రమణ్యం, డి.గోపాల్, కె.సాయి నవీన్, సిద్ధేంద్ర శర్మ, వెంకటరమణ, కార్యదర్శి కేఎస్.రాజా, కొత్తపల్లి శంకరయ్య, పొన్నాల జీజిరెడ్డి, వెంకట్రామయ్య, సుబ్రమణ్యంరెడ్డి, చెంగారెడ్డి పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు